
# నా తొలి రచన




## అయ్యగారి రాజారావు

**ఆఫీసులో ఎవరి పనుల్లో వాళ్ళు మునిగివున్నారు. కానీ పేరుకు మాత్రమే. ఎవరి సొంత పనులు వాళ్ళు చేసుకుంటున్నారన్న మాట.**

మీనాక్షి తన కొత్త చీర గురించి ఇంకా అడగలేదే ఎవరూ అని వర్రీ అవుతోంది. ఇక లాభం లేదనుకుందేమో తనే లత టేబుల్ దగ్గరకెళ్ళింది. వాళ్ళ చర్చే వాళ్ళది. ఇంక పక్కవాళ్ళ సంగతి వాళ్ళ కనవసరం. సుబ్బారావు సాయంత్రం ప్రోగ్రాం గబగబా పేపరుమీద బరుకుతున్నాడు. బహుశా మీనాక్షి కివ్వడానికే. రఘుపతి ఎప్పుడూ లేనిది యమ స్పీడుగా టైపు చేస్తున్నాడు. ఏదో మంచి జాబ్ పర్క్ తగిలుంటుంది. సుధాకర్ ఇవన్నీ గమనిస్తూనే వున్నాడు. అతనికి మహా చిరాగ్గా వుంది. గంటనుంచి తెగరాస్తున్నా అంతూ పొంతూ లేకుండా పోతోంది. ఎక్కడున్న సమస్య అక్కడే వుంది. ఇలా అయితే ఈ పని ఎప్పటికయేట్టు! అంతా డిస్టర్బెన్సే. ఎవరిపనులు వాళ్ళు చేసుకోవచ్చుకదా అనుకున్నాడు. ఐమీన్ అసలు ఆఫీసు వర్కన్నమాట. ఇంతకీ సుధాకర్ ఏదో ఆఫీసు విషయం తేలక చిరాకుపడుతున్నాడని పొరపడద్దు. పొద్దున్నుంచీ అంటే 10-30 గంటలకి ఆఫీసు తెరిచినప్పటినుంచి సతమతమవుతున్నా తన కథకి ముగింపెలా చేయాలో తెలియటం లేదు. సుధాకర్ రచయిత కాదు. ఎప్పుడూ వ్రాయలేదు. తను పుట్టిన ఇరవై తొమ్మిదేళ్ళకి ఇప్పుడు వ్రాయాలనిపించింది. ముందు 'పెద్ద ప్రాబ్లెమ్ ఏముంది. ఇంత

మంది రాస్తున్నారు. ఎమ్. ఎ. తెలుగు అయిన నేనామాత్రం వ్రాయలేనా' అనుకున్నాడు. కానీ తీరా చూడబోతే పన్నెండు గంటలయినా ఏం తెమల్లేదు. గంటన్నర వృధా అనుకున్నాడు. కానీ తను రోజూ పదకొండు గంటల కొస్తాడని ఇవాళ కూడా అలాగే వచ్చాడని మర్చిపోయాడు. అసలే చిరాగ్గా వుంది. ఆఫీసరేవన్నా మధ్యలో వస్తాడేమోనని బెరుగ్గా వుంది. ఎవరో కొత్తగా వచ్చాడు, సర్వీసు కమిషను బాపతు. వచ్చి ఒకరోజే అయినా, ఆ రోజే డిసిప్లిన్ అనీ, అదనీ, ఇదనీ కొంచెం కూశాడు. పోన్లే కుర్ర సన్నాసికన్నా తనే అయిదేళ్ళు సీనియర్ కదా అని సరిపెట్టుకున్నాడు. అదీ ఇదీ పేలినా ఆఖర్న "నేను సర్వీసులోను, వయసులోను మీ అందరికన్నా చిన్నవాణ్ని. అంచేత మీ సలహాలు మాత్రం నాకెల్లప్పుడూ వుండాలి" అని ముగించాడు. దాంతో చాలా మందికి 'ఆ! ఏం కావాలన్నా మనల్ని అడగాల్సిందిలే' అనే భయం పోయింది. అదే ధైర్యం తనకూ వచ్చింది. దాంతో ఎన్నాళ్ళని వెధవ ఆఫీసులో హస్తు కొడతాంలే అనుకుని కథ మొదలుపెట్టాడు. సగంవరకూ బాగానే వచ్చింది కానీ ముగింపు చచ్చినా తెలియటంలేదు. అప్పటికే బోలెడు కాగితాలు చించేశాడు. 'అయ్యో శ్రమ వృధా అయిందే' అనుకున్నాడుగానీ ఇన్ని కాగితాలు వృధా చేశాననుకోలేదు - అవి తనవికాదు, ఆఫీసువి కాబట్టి. ఇలా ఎంతసేపు కూర్చున్నాడో తెలియలేదు. ఎప్పుడు వచ్చాడో, ఏమో ఆఫీసరు తన ముందు తను వ్రాసిన కాగితాలు పట్టుకు నిల్చున్నాడు. అతని ముఖంలో ఏ భావనా లేదు. సుధాకర్‌కి షాక్‌లో లేవాలని కూడా తట్టలేదు. "విల్ యూ ప్లీజ్ కమ్ టు మై రూమ్?" అని కాగితాలు తిరిగి ఇవ్వకుండానే హుందాగా వెళ్ళిపోయాడు. ఆఫీసంతా నిశ్శబ్దం. సుబ్బారావు వచ్చి "నీ దగ్గర కొచ్చి ఏదో ఫైలడిగాడు గురూ, నువ్వేమో ఏదో లోకంలో విహరిస్తున్నావు. అతని దృష్టి నీ టేబుల్‌మీద పడింది. కొంపదీసి ఎవరికైనా ఆఫీసులో వాళ్ళకి ప్రేమలేఖ ఏవిటి? అయినా ఇలాంటిది కాస్త తెలివిగా ఏడవాలి. వెళ్ళు. వెళ్ళి ప్రేమగీతం విని తరించు" అని డైలాగొదిలి పోయాడు.

'ఇంతమంది ఇన్ని పనులు (సొంతవి) చేసుకుంటున్నా తనే ఇలా పట్టుబడటం సిగ్గుగా వుంది. తను ఎప్పుడు లోపలికెళ్ళి బయటికొస్తాడా. ముఖం ఏ భంగిమలో వుంటుందా అని అందరూ ఉత్సుకతతో వున్నట్టున్నారు. మొదటిగా ఆఫీసర్ స్పెషల్ (అదే చివాట్లు) తినబోయేవాడు తనే. ఆ అదృష్టం తమకు పట్టనందుకు లోలోపల సంతోషపడుతున్నారు. ఇక తప్పదు కాబట్టి మెల్లగా కదిలి స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని లోపలి కెళ్ళడాని కుపక్రమించాడు. వెళ్ళే ముందు కంటిచివరనుంచి ఒకక్షణం పరికించాడు. ఏం కనపడలేదుగాని కొన్ని దబ్బన్ల కళ్ళు బైటకొచ్చినట్టు, అదే సంఖ్యలో చెవులు రిక్కించి వున్నట్టు అనుమాన మొచ్చింది లోపలి కెళ్ళగానే "సిట్‌డౌన్ మిష్టర్ సుధాకర్. జస్ట్ ఎ మూమెంట్" అని తను రాస్తున్నదేదో రెండు నిముషాల్లో పూర్తిచేశాడు. తుఫాను వచ్చే ముందు వాతావరణం ఇలాగే వుంటుంది కదూ అనుకున్నాడు సుధాకర్—ఎంతయినా రచయిత కదా!

"చూడండి సుధాకర్‌గారూ! మీరు చాలా అదృష్టవంతులు. అందరూ రచయితలు కాలేరు. అంతెందుకు—నాకూ కథలు వ్రాయాలని ఉబలాటం. కాని ఎంత ప్రయత్నించినా అసలు ఎలా మొదలు పెట్టాలో ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థంకాలే దిప్పటికీ. మీ కథ మధ్యలో ఆగిపోయి నట్టుంది. బహుశా ముగింపు కుదరనట్లుంది. అవునా?" అని అడిగాడు. సుధాకర్‌కి నోరు పెగల్లేదు. రెండు నిముషాలకి తేరుకుని "థాంక్యూ సర్! అయామ్ సారీ సర్! అయామ్ సారీ సర్. ఇది నా తొలి రచన సర్" అని ఉబ్బిపోయి జవాబిచ్చాడు. ఆఫీసర్ బాయ్‌ని పిలిచి కాఫీ తెమ్మన్నాడు.

"ఇంతకీ ముగింపు ఆలోచించారా?"

"లేదండి. ఎంత ప్రయత్నించినా కుదరటంలేదు." కాసేపు మిగతా ఆఫీసు విషయాలు మాట్లాడాడు. తను కాస్త సీనియర్ కాబట్టి ముందు డ్రాఫ్టలన్నీ కరెక్షన్‌కి పంపిస్తానన్నాడు. సుధాకర్ సంతోషానికి అవధుల్లేవు. ఇంకో రెండు సంవత్సరాలలో తనకి ప్రమోషన్ ఖాయం అనుకున్నాడు. సుధాకర్ ఆలోచనలని భంగపరుస్తూ ఆఫీసర్ "ఒక పని చేయండి.

మీరేవీ అనుకోనంటే నేను కూడా ఆలోచిస్తాను! కానీ ఒక షరతు. కథ ప్రచురణకి పంపేటప్పుడు నా పేరు కూడా వేయాలి! అఫ్‌కోర్స్ నచ్చితేనే. అలాగే ఇంకా ఫ్రెండ్స్‌ని కూడా అయిడియా అడగండి. కథ కెప్పుడూ ముగింపే ఆయువు పట్టుకదా మరి. సరేనా?" అన్నాడు. సుధాకర్ సరేనని కాగితాలు తీసుకుని గాలిలో తేలియాడుతూ ముఖం చేటంత చేసుకుని బయటికొచ్చాడు. సుధాకర్ వాటం చూసి స్టాఫంతా నీరుగారి పోయారు. ఇలా వ్యవహారం తిరగబడిం దేవిటి చెప్మా అని ఆశ్చర్యపోయారు. లంచ్ అవర్లో సుధాకర్ అదృష్టం అందల మెక్కిందని అసూయపడ్డారు. సుధాకర్ లోపలికెళ్ళకముందు తమకా అదృష్టం పట్టనందుకు సంతోషపడినవారంతా ఇప్పుడు తమకే ఆ గతి పట్టి వుండకూడదా అని వాపోయారు.

మర్నాడు ప్రొద్దున్నించి సుధాకర్‌కి కొంచెం బెంగగా వుంది. నిన్న సంతోషంతో ఏమీ తట్టలేదుగానీ ఇప్పుడాలోచిస్తే 'ఇంతా కష్టపడి తను రాస్తే ముగింపు ఏదో చెప్పి ఆఫీసరు తన పేరు పైన వేయించాలంటాడేమో. లేదా మొత్తం చదువుతానని తన పేరు వేసుకుని పంపుతాడో... పంపినా తను చేయగలిగిందేమీలేదు..' ఇలా పరిపరి విధాల ఆలోచించి చివరకు "అలా చేసేవాడయితే అప్పుడే లాక్కుని చివాట్లువేసి ఆ పని చేసేవాడులే' అని సర్ది చెప్పుకున్నాడు. ఒకవైపు ఇలా వున్నా తన అదృష్టం ఇక పండిందిలే అని ఆనందంగానూ వుంది. ఆలోచిస్తూనే ఎప్పుడూ లేనిది పదిన్నరగంటలకే ఆఫీసుకొచ్చేశాడు.



ముగింపు విషయంలో ఒక నిర్ణయాని కొచ్చినా, ఆఫీసర్ మరి ఇద్దరి కొలీగ్స్ అయిడియాకూడా తీసుకుని ఫైనల్ చేద్దామనుకున్నాడు. సెక్షన్‌లోకి అడుగుపెట్టగానే మూర్ఛవచ్చినంత పనైంది. అటెండెన్స్ హౌస్‌ఫుల్. పైగా తనొక్కడే లేటు. అందరూ తలలు దించి తీవ్రంగా పనిచేసేస్తున్నారు. సుబ్బారావు కూడా— మెల్లిగా తెప్పరిల్లి ఏమిటి సంగతని అడిగాడు. "అబ్బ వుండు గురూ. కథ వ్రాస్తున్నాను" అని తిరిగయినా చూడలేదు. 'హారీశ్నీ! వీళ్ళంతా కథలు వ్రాసేసి ఆఫీసరుకి మస్కా కొడదామనుకుంటున్నారన్న మాట! 'చటుక్కున ఒక ఆలోచన వచ్చింది.' వీళ్ళందరినీ తలదన్నాలంటే ఒకే మార్గం. తను తెలివిగా "అయిడియా, అదే ముగింపు మీదే కద సార్. ముగింపే ఆయువుపట్టు కాబట్టి న్యాయంగా మీ పేరే వుండాలి సర్ రచయిత స్థానంలో" అని కథ ఫెయిర్ చేసి ఆయనకే ఇచ్చేస్తాడు. దాంతో మిగతా వాళ్ళందరి ప్లాన్ బలాదూర్. పోతే పోయింది. అందరికన్నా ఆఫీసరు దృష్టిలో ఒక మెట్టు పైనుంటాడు. ఆ తరవాతతిరిగ్గా ఎన్నో కథలు వ్రాసుకోవచ్చు.' తిన్నగా ఆఫీసర్ రూమ్‌లోకి వెళ్ళి "గుడ్ మార్నింగ్ సర్" అన్నాడు.

"కూర్చోండి. అయిడియా వచ్చిందా?"

"లేదు సార్! ఎంత ఆలోచించినా లాభం లేకపోయింది. మీరే హెల్ప్ చేయాలండీ."

"కానీ ఇంకో చిన్న షరతు. ముగింపే ఆయువుపట్టు కదా! అందుచేత నచ్చితే రచయితగా నా ఒక్కడి పేరే వుండాలి. సమ్మతమేనా మరి."

'ఇదేంటబ్బా! నా ఊహలన్నీ ఈ ఆఫీసరుగాడు ముందే కనిపెట్టేసినట్టున్నాడు' అనిఆశ్చర్యపోయినా సరేనన్నాడు. సుధాకర్ ఒప్పుకోగానే తను వ్రాసిన కాగితాలు అందించాడు ఆఫీసరు. సుధాకర్ చదవడం మొదలెట్టాడు. అంతలోనే "ఇదేంటి సార్! ఎక్కడా పొంతన లేదు" అని తల ఎత్తాడు.

అంతే! ఆఫీసరు ముఖం కందగడ్డలా వుంది.

"గెటప్ మిస్టర్ సుధాకర్. ఆఫీసు టైములో కథలు వ్రాస్తున్నందుకు డిసిప్లినరీ యాక్షన్ తీసుకుంటూనిన్నుసస్పెండు చేస్తున్నట్టు వ్రాసిన డ్రాఫ్ట్ మెమో అది. ఇవన్నీ నువ్వు పాడుచేసిన కాగితాలు. అన్నట్టు ఏ కథకయినా ఆయువుపట్టు ముగింపు కదూ! ఇదిగో ఇది ఫెయిర్ కాపీ. అన్నట్టు కింద సంతకం నాదే వుంటుంది మరి!" అని ఆర్డరు చేతికిచ్చి సంతకం తీసుకున్నాడు. "మీరిక వెళ్ళవచ్చు" అని "వన్ మినిట్. చెప్పడం మరిచాను. ఈ డ్రాఫ్ట్ నేను వ్రాసిందే. ఎవరూ కరెక్ట్ చేయలేదు. ఒక విధంగా ఇది నా తొలి రచన." ●





జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తి, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికీ, చల్లదనానికీ, దానికదే సాటి. రీటా వాడి. మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.

రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును




స్త్రీలూ పురుషులూ వాడవచ్చును

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది.